

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





15 శనివారం, ఆగస్టు 2026 పేజీలు:08




## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

07

- నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ : డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

## ఏఐ ఆధారిత ప్రాథమిక విద్యలో మహబూబ్‌నగర్‌కు రాష్ట్ర అగ్రస్థానం

- 79 ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసనం

02

- ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారుల సమిష్టి కృషికి జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి అభినందనలు





## ఖర్గే అవమానంపై కాంగ్రెస్ సత్యాగ్రహం

02

- అన్ని కులాల సమూహమే దేశం: శివసేనారెడ్డి
- దళితులను అవమానిస్తే బీజేపీకి పుట్టగతులు ఉండవు: మేఘారెడ్డి
- వనపర్తిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు








మహబూబ్‌నగర్, ఆగస్టు 14
( ప్రజా జ్యోతి బ్యూరో ):

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల మౌలిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన అభ్యసనాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా అమలు చేస్తున్న కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా 79 ప్రభుత్వ పాఠశాలలు ఏఎక్స్‌ఎల్ ఏఐ వేదికలో నమోదైన జిల్లాగా మహబూబ్‌నగర్ గుర్తింపు పొందింది.

మిగతా 2లో...

# ఖర్గే అవమానంపై కాంగ్రెస్ సత్యాగ్రహం

**వనపర్తి, ఆగస్టు 14 (ప్రజాజ్యోతి):**




కులం, మతం, ప్రాంతం ఆధారంగా ప్రజలను విభజించకుండా అన్ని వర్గాల సమూహంగా ఉన్నదే భారతదేశమని డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై బీజేపీ నాయకుల చర్యలను నిరసిస్తూ శుక్రవారం వనపర్తిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనా రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ ర్యాలీ జరిగిన ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం అత్యంత అభ్యంతరకరమన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ప్రజాస్వామ్యానికి పునాదులని పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు తమ హక్కుల కోసం గళం విప్పుతున్నా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఖర్గేకు కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రాముడి పేరు, అక్షింతల పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ దళితులను మోసం చేస్తే ఆ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తూ ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, అధికార ప్రతినిధి వెంకటేష్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తర్వాత

మొదటి పేజీ తర్వాత

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## - జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందనం అనంతరం ఉదయం 9.32 నుంచి 9.45 గంటల వరకు పోలీస్ కవాతు నిర్వహించనున్నారు. ఉదయం 9.45 నుంచి 10.15 గంటల వరకు మంత్రి జూపల్లి కృష్ణారావు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇవ్వనున్నారు. అనంతరం 10.15 నుంచి 10.20 గంటల వరకు స్వాతంత్ర్య సమరయోధుల పరిచయం, సన్మానం నిర్వహిస్తారు. 10.20 నుంచి 10.50 గంటల వరకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10.50 నుంచి 11.20 గంటల వరకు వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఉంటుంది. 11.20 నుంచి 11.40 గంటల వరకు ప్రశంసా పత్రాల పంపిణీ, 11.40 నుంచి 11.50 గంటల వరకు వివిధ స్టాళ్లను మంత్రి సందర్శిస్తారు. అనంతరం 11.50 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హై టీతో కార్యక్రమం ముగియనుంది. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు

# ఏఐ ఆధారిత ప్రాథమిక విద్యలో మహబూబ్‌నగర్‌కు రాష్ట్ర అగ్రస్థానం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల మౌలిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన అభ్యసనాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా అమలు చేస్తున్న కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా 79 ప్రభుత్వ పాఠశాలలు ఏఎక్స్‌ఎల్ ఏఐ వేదికలో నమోదైన జిల్లాగా మహబూబ్‌నగర్ గుర్తింపు పొందింది.జిల్లాలో ఈ కార్యక్రమాన్ని 2025 మార్చి 15న కేవలం 10 పాఠశాలలతో ప్రారంభించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయడంతో 202526 విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమం 49 పాఠశాలలకు విస్తరించింది. ప్రస్తుతం 202627 విద్యా సంవత్సరంలో 79 పాఠశాలలకు చేరుకోవడం విశేషం.కేవలం 10 పాఠశాలలతో ప్రారంభమైన కార్యక్రమం రెండేళ్లలో 79 పాఠశాలలకు విస్తరించడం ద్వారా జిల్లా విద్యాశాఖ గణనీయమైన పురోగతి సాధించింది. జిల్లాలోని 17 మండలాల్లోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత మౌలిక అభ్యసనాన్ని విస్తరించడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అభ్యసన అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి.ఈ ఘనతపై జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి హర్షం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధస్సు వినియోగం, పనితీరులో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆమె హృదయపూర్వకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి మండల విద్యాధికారుల సమావేశంలో కూడా మహబూబ్‌నగర్ జిల్లా కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసన కార్యక్రమం పనితీరు, వినియోగం ప్రత్యేకంగా ప్రశంసలు అందుకుందని ఆమె తెలిపారు. ఈ విజయం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, విద్యార్థుల సమిష్టి కృషి, అంకితభావం, సమన్వయానికి నిదర్శనమని విజయకుమారి పేర్కొన్నారు.

**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పాఠశాలలకు అభినందనలు:**

సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసన కార్యక్రమాన్ని అత్యుత్తమంగా అమలు చేస్తున్న పాఠశాలలను ప్రత్యేకంగా అభినందించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. అదేవిధంగా ఖాన్ అకాడమీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న ఉత్తమ పాఠశాలలను కూడా గుర్తించి ప్రశంసించనున్నట్లు వెల్లడించారు. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న పాఠశాలల కృషిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతర పాఠశాలలకు స్ఫూర్తి కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆమె తెలిపారు. కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసన కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగిస్తూ విద్యార్థులు క్రమం తప్పకుండా అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని విజయకుమారి సూచించారు. విద్యారంగంలోని ఇతర కార్యక్రమాల్లోనూ ఇదే ఉత్సాహం, సమన్వయం, ఉత్తమ పనితీరును కొనసాగించాలని ఆమె పిలుపునిచ్చారు. "సమిష్టి కృషితో మహబూబ్‌నగర్ జిల్లా విద్యారంగంలో మరింత ముందంజ వేయాలి. కృత్రిమ మేధస్సు ఆధారిత అభ్యసనాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరింత మెరుగైన అభ్యసన అవకాశాలు కల్పించాలి" అని జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి ఆకాంక్షించారు.

# జర్నలిస్ట్ సాయిలు సాగర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 14 : ప్రజా జ్యోతి**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సాయిలు సాగర్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.సాయిలు సాగర్ తో మాట్లాడి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



# ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్!

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 14(ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ పట్టణంలోని సంత బజార్ రీడింగ్ రూమ్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు విపరీతంగా పెరిగి ప్రజలకు ఇబ్బందికరంగా,ప్రమాదకరంగా మారాయని, ప్రమాదాలు జరగకముందే మున్సిపల్ అధికారులు,విద్యుత్ సిబ్బంది వెంటనే స్పందించి ట్రాన్స్ ఫార్మర్ చుట్టూఉన్న కంపచెట్లను తొలగించడమే కాకుండా,ప్రజల భద్రత దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలని మున్సిపల్ పాలకులను కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేశారు.




# బీఆర్ఎస్ నేతలు హద్దులు దాటితే ఊరుకోం..!




**- ఓటమి బాధలో పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తే సహించం**
**- సంయమనం పాటిస్తున్నాం.. బలహీనులం కాదు**
**- పోతిరెడ్డిపాడుపై ఇప్పుడు ప్రేమ ఎందుకు?**
**- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఘాటు హెచ్చరిక**

**వనపర్తి, ఆగస్టు 14 (ప్రజాజ్యోతి):**

బీఆర్ఎస్ మాజీ నాయకులు పనీపాట లేకుండా విహాం యాత్రలు చేస్తూ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. ఎన్నికల ఓటమి నుంచి బయటపడలేక తప్పుడు సమాచారంతో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలకు ఇప్పుడు ప్రేమ ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. 201423 మధ్య బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిబంధనలకు మించి నీరు తరలిపోతుంటే ఎందుకు స్పందించలేదన్నారు. జూరాల ఎల్ఎంసీ, రాజీవ్ భీమా ఫేజ్2, కేఎల్ఐ ద్వారా వనపర్తి నియోజకవర్గంలో 90,741 ఎకరాలకు సాగునీరు అందుతోందని, ఈ ప్రాజెక్టుల్లో ఎక్కువ భాగం గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించినవేనని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో వనపర్తి నియోజకవర్గానికి ఒక్క ఎకరా అదనంగా సాగునీరు అందించారా? అని సవాల్ చేశారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు, ఇతర పెండింగ్ బిల్లులకు రూ.4 వేల కోట్లు చెల్లించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తొందరపడి పూర్తి చేసి చివరకు సమస్యాత్మకంగా మార్చారని విమర్శించారు. కేటీఆర్ సిరిసిల్ల ఎమ్మెల్యే అని, తాను వనపర్తి ఎమ్మెల్యేనని మేఘారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిని ప్రతి విషయంలో విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, కేటీఆర్ ఏం తిస్మార్‌ఖాన్ కాదనీ హెచ్చరించారు. ముందుగా కవిత చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని, ఆ తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడాలని సూచించారు. ఆగస్టు 1న ఎల్లూరు, 2న సింగోటంజొన్నలబొగుడ, 3న గుడిపల్లి రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేశామని తెలిపారు. ఒక్క రోజులో నాలుగు టీఎంసీల నీరు ఎలా పారుతుందో అవగాహన ఉన్నవారు చెప్పాలని, ప్రాజెక్టుల నిర్వహణపై అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణలో కాంగ్రెస్ బీఎల్ఏలు సమర్థంగా పనిచేశారని ఎమ్మెల్యే తెలిపారు. డబుల్ ఓట్ల తొలగింపుతో వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లో ఓట్ల సంఖ్య తగ్గిందన్నారు. వనపర్తి సెగ్మెంట్‌లో 86 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ నెలాఖరులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వనపర్తికి రానున్నారని వెల్లడించారు. అధికారంలో ఉన్నందున తాము సంయమనం పాటిస్తున్నామని, బలహీనులమని భావించవద్దని మేఘారెడ్డి అన్నారు. వ్యక్తిగత విమర్శలకు దిగితే కాంగ్రెస్ కార్యకర్తలు అదే స్థాయిలో స్పందిస్తారని హెచ్చరించారు. విమర్శకు ప్రతి విమర్శ ప్రజాస్వామ్యంలో సహజమేనని, హద్దులు దాటితే మాత్రం గట్టి సమాధానం తప్పదన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరి రాములు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు డ్రమ్ సెట్ వితరణ

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 14(ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ పరిధిలోని దేశిటిక్యాల గ్రామప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ గవర్నర్ రాధాకృష్ణ చేతుల మీదుగా డ్రమ్ సెట్ అందజేశారు.ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని డ్రమ్ సెట్ కావాలని కోరడం జరిగిందని ఆ మేరకు డ్రమ్ సెట్ అందజేశామని ప్రభుత్వం పేద విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నదని,వాటిని ఉపయోగించుకొని విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి, కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి,కాబినెట్ సభ్యులు దొడ్ల రాజవర్ధన్ రెడ్డి,డాక్టర్.తెప్ప శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి,రామకృష్ణారెడ్డి ప్రధా నోపాధ్యాయిని మంజుల,పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ప్రతి ఇంట జెండా ఎగరాలి
# దేశ గౌరవాన్ని కాపాడాలి
## రాష్ట్ర బిజెపి నాయకులు కురువ మల్లయ్య

- చిన్నంబావిలో ఘనంగా భారీ తిరంగా ట్రాక్టర్ ర్యాలీ
- జాతీయ జెండాలతో కదం తొక్కిన విద్యార్థులు, యువత, రైతులు
- దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిన బీజేపీ తిరంగా ర్యాలీ

చిన్నంబావి, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి)

భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా చిన్నంబావి మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నంబావి మండల కేంద్రంలోని భారీ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ వివేకానంద పాఠశాల విద్యార్థుల మరియు ట్రాక్టర్ల ర్యాలీ చిన్నంబావి చౌరస్తా నుండి ప్రారంభమై పుర వీధుల గుండా స్థానిక పోలీస్ స్టేషన్ వరకు సాగింది. అక్కడి నుంచి తిరిగి చిన్నంబావి చౌరస్తా చేరుకుంది. ర్యాలీలో విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు,యువత, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" వంటి నినాదాలతో చిన్నంబావి పుర వీధులను మార్మోగించారు. జాతీయ జెండాలతో అలంకరించిన ట్రాక్టర్లతో రైతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో రైతులు తమ ట్రాక్టర్లను తీసుకొచ్చి వాటికి జాతీయ జెండాలను కట్టి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ర్యాలీని ప్రారంభించిన రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి చిన్నంబావి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య. ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశం పట్ల ప్రతి ఒక్కరిలో బాధ్యతా భావం పెంపొందాలని చెప్పారు. యువత దేశ అభివృద్ధిలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.యువతలో దేశభక్తి పెంపొందించాలి వందేమాతరం గీతానికి



ప్రాధాన్యత కల్పిస్తూ పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం గొప్ప విషయమని జగ్గారి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత, జాతీయ భావాలను మరింత పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం ఒక పండుగగా కాకుండా, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునే సందర్భంగా ప్రతి ఒక్కరూ భావించాలని ఆయన సూచించారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తిరంగా ర్యాలీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.భారీగా పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య, జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, చిన్నంబావి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, ఓబీసీ మోర్చా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి గణేష్ రెడ్డి, ఎం. లింగస్వామి, కిరణ్, వెంకటస్వామి, మండ్ల గోపాల్, ఎన్. బాలయ్య నాయుడు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరంగా యాత్రను విజయవంతం చేశారు.

# చిన్నంబావి మండల కేంద్రంలో వెన్నెల పాల కేంద్రం ప్రారంభం

చిన్నంబావి, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల కేంద్రంలోని మోహన్ రాజు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వెన్నెల పాల కేంద్రం, విఘ్నేశ్వర కమ్యూనికేషన్స్, జిరాక్స్, ఇంటర్నెట్, టూర్స్ అండ్ ట్రావెల్స్‌ను శుక్రవారం నిర్వాహకుడు పసుల రాజ్‌కుమార్ తల్లిదండ్రులు పసుల చంద్రయ్య, మద్దమ్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.వెన్నెల పాల కేంద్రంలో 100 శాతం గేదె పాలు, పెరుగు, పాల పదార్థాలు సరసమైన ధరలకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కమ్యూనికేషన్స్ కేంద్రంలో ఆధార్, పాన్‌కార్డు, ఆన్‌లైన్ దరఖాస్తులు, జిరాక్స్, మనీ ట్రాన్స్‌ఫర్, రైల్వే, బస్సు, విమాన టికెట్ల బుకింగ్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ బిళ్ళ కంటి విద్యాసాగర్ రావు పెద్ద మారు సర్పంచ్ ఉప సర్పంచ్ నరేష్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కృష్ణప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.





# హిందూ సమాజ ఐక్యతతో దేశాభివృద్ధి దిశగా యువత ముందడుగు
## గండీడ్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం

గండీడ్, ప్రజాజ్యోతి:

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమాజంలో ఐక్యత, యువతలో చైతన్యం పెంపొందించడంతో పాటు దేశాభివృద్ధి కోసం యువత ఏకమై ముందుకు సాగాలనే సంకల్పంతో కోస్గీ ఖండ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. గండీడ్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రధాన వక్త మరాఠి వెంకటరాములు మాట్లాడుతూ హిందూ సమాజం ఐక్యంగా ఉండడంతో పాటు యువత దేశ సేవ, సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతిలో యువత భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు బి. యాదయ్య, జిల్లా ప్రచార ప్రముఖ్ ప్రకాశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, గండీడ్ మండల బీజేపీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### ఆగస్టు 15న మహబూబ్‌నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మహబూబ్‌నగర్ ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అర్హులైన లబ్ధిదారులు హాజరుకానున్నారు. స్మార్ట్ రేషన్ కార్డులకు అర్హులైన లబ్ధిదారులకు కార్యక్రమంపై ముందస్తుగా సమాచారం అందించి, వారు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

# పార్టీ విధేయులకు సముచిత గౌరవం

## డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి

వనపర్తి, ఆగస్టు 14 (ప్రజాజ్యోతి):

పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన విధేయులకు కాంగ్రెస్‌లో సముచిత గౌరవం ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తిలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమావేశానికి హాజరయ్యారు. పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలు, కమిటీల పనితీరు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగాలని శివసేన రెడ్డి సూచించారు. రాష్ట్ర అధిష్ఠానం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కార్యాలయానికి భూమిపూజతో పాటు పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ చురుగ్గా పనిచేయాలని సూచించిన ఆయన.. ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిచేసిన మండల అధ్యక్షులు, ఇన్‌చార్జిలను అభినందించారు. వారం రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా, యువజన కాంగ్రెస్, విద్యార్థి విభాగాలకు సంబంధించిన పూర్తి కమిటీలను ప్రకటిస్తామని




తెలిపారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, మున్సిపల్ చైర్‌పర్సన్లు మాధవి, శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధి వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు చీర్ల జనార్ధన్, బి.కృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాములు, మండల అధ్యక్షులు రవికిరణ్, రామిరెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పాఠశాలల్లో నిధుల సద్వినియోగంతో స్పష్టమైన మార్పు కనిపించాలి

## - వచ్చే వారంలోగా కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి
## - పాఠశాలల్లో మౌలిక వసతుల లోపాలు లేకుండా చూడాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):

జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను నిబంధనల మేరకు సక్రమంగా వినియోగించి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించడం మాత్రమే కాకుండా, వాటి వినియోగంతో పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల్లో కేంద్ర నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పీఎం శ్రీ పాఠశాలలను ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేయాలని ఆమె సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను వచ్చే వారంలోగా పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి:

పాఠశాలల్లో డ్రైనేజీ, గేట్లు, తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, లైట్లు, ర్యాంపులు తదితర సౌకర్యాల్లో చిన్నపాటి లోపాలు కూడా ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్లలో తలుపులు, లైట్లు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరగతి గదుల్లోని అన్ని ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని, దెబ్బతిన్న తలుపులు, కిటికీలు, ర్యాంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

### బిఫోర్‌ఆఫ్టర్ ఫొటోలు తప్పనిసరి:

పీఎం శ్రీ నిధులతో చేపట్టే ప్రతి పనికి సంబంధించిన ఖర్చుల వివరాలను పాఠశాల రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మరమ్మతు పనులు చేపట్టే ముందు, పనులు పూర్తయిన అనంతరం ఫొటోలు తీసి, వాటితో పాటు తేదీ, జీపీఎస్ కోఆర్డినేట్ల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన ఫైళ్లలోనూ బిఫోర్‌ఆఫ్టర్ ఫొటోలు




తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

### స్వీయ రక్షణ శిక్షణ ప్రయోజనకరంగా ఉండాలి:

విద్యార్థులకు అందిస్తున్న స్వీయ రక్షణ శిక్షణను కేవలం నిధుల వినియోగం కోసం నిర్వహించే కార్యక్రమంగా భావించరాదని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు వాస్తవంగా స్వీయ రక్షణ నైపుణ్యాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. శిక్షణా సామగ్రి, ఇతర వసతులను సమర్థవంతంగా వినియోగిస్తూ కార్యక్రమాన్ని ప్రయోజనకరంగా నిర్వహించాలని ఆదేశించారు.

### వచ్చే వారం నుంచి పాఠశాలల తనిఖీలు:

త్వరలో పీఎం శ్రీ పాఠశాలలను క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే వారం నుంచి తన పర్యటనల్లో పీఎం శ్రీ పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల వారీగా అవసరాలను ముందుగానే గుర్తించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు పరస్పరం తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకుని, ఒక పాఠశాలలో విజయవంతమైన కార్యక్రమాలను ఇతర పాఠశాలల్లోనూ అమలు చేసేలా సహకారం పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

# పోలెపల్లిలో పారిశుధ్యం, ఇందిరమ్మ ఇళ్ల పనులపై అదనపు కలెక్టర్ తనిఖీ

**- గుడిసెలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లకు ప్రతిపాదనలు పంపాలి: మధుసూదన్ నాయక్**

మహబూబ్‌నగర్, ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):

జడ్చర్ల మండలం పోలెపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రాథమిక పాఠశాలలోని వసతులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుధ్య ఏర్పాట్లను ఆయన పరిశీలించి, పారిశుధ్య కార్యక్రమాల అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాని పరిస్థితిని గుర్తించిన అదనపు కలెక్టర్.. గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం పోలెపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు అందుతున్న వసతులు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టాల్సిన



పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం, గృహ నిర్మాణం, పాఠశాల వసతుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# విద్యార్థుల సృజనాత్మక ప్రతిభకు'జ్ఞనధార' ప్రతిబింబం

**-'జ్ఞనధార' పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

మహబూబ్‌నగర్, ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి, వారి నైపుణ్యాలను ప్రోత్సహించే ఉద్దేశంతో రూపొందించిన 'జ్ఞనధార' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థులు తమ ప్రతిభను కథలు, డ్రాయింగ్స్, కవితలు తదితర సృజనాత్మక రచనలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వాటిని ఒక పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులాల ఆర్.సి.ఓ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



# అవయవదానం మరొకరికి జీవితాన్ని అందించే మహాదానం

**- ఎన్టీఆర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అవయవదానంపై అవగాహన సదస్సు**

మహబూబ్‌నగర్, ఆగస్టు 14

( ప్రజా జ్యోతి బ్యూరో ):




మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ & పీజీ కళాశాల (అటానమస్)లో అఖిల భారత అవయవదాతల సంఘం సమన్వ యంతో, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన సదస్సును నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ వి. నటరాజ్ మాట్లాడుతూ, మరణానంతరం అవయవాలను దానం చేయడం ద్వారా మరొకరికి కొత్త జీవితాన్ని అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఒక కుటుంబం తీసుకునే ధైర్యమైన నిర్ణయం మరో కుటుంబానికి కొత్త ఆశను, జీవితాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. అందువల్ల అవయవదానం సాధారణ దానం కాదని, జీవితాన్ని అందించే మహాదానం అని అన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఎస్.వి.ఎస్. మెడికల్ కాలేజీలకు 273 కళ్లను, 18 డెడ్ బాడీలను దానం చేసినట్లు ఆయన తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ, మనిషి జీవితం ఒకరోజు ముగిసినా, మన మానవత్వానికి ముగింపు ఉండకూడదన్నారు. మన మంచి నిర్ణయం మరొకరి జీవితంలో కొనసాగుతుందని పేర్కొన్నారు. అవయవదానం ద్వారా మరొకరికి చూపును, జీవితంపై ఆశను అందించవచ్చని, ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ, సమాజంలో అవయవదానంపై అనేక అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించాల్సిన బాధ్యత విద్యావంతులు, ముఖ్యంగా సైన్స్ విద్యార్థులపై ఉందన్నారు. బ్రెయిన్ డెడ్ వ్యక్తుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు వచ్చి అవయవదానం చేస్తే అనేక కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని తెలిపారు. అవయవదానంపై సదస్సులో తెలుసుకున్న విషయాలను విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజానికి తెలియజేసి అవగాహన పెంచాలని ఆమె సూచించారు. అవయవదానం ద్వారా మానవత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ వేణుగోపాల్, బాలలెరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, రఘువీర్ గుప్త, అదిబాతాజ్, నసీంభాను, వెంకటరమణ మూర్తి, డాక్టర్ సీ.హెచ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడే 80వ,స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**- ముఖ్య అతిథిగా ప్రణాళికా సంఘంఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి**

నాగర్ కర్నూల్ : ఆగస్టు 14 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లాలో 80వ,స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించను న్నారు.జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఉదయం 9.20 గంటలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ శుక్రవారం తెలిపారు.శనివారం ఉదయం 09:05 గంటలకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో,09:10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, 09: 15 గంటలకు ముఖ్య అతిథి జి.చిన్నా రెడ్డి పరేడ్ మైదానానికి చేరుకొని 09:20 గంటలకుజాతీయ పతాకావిష్కరిస్తారని,అనంతరం జాతీయ గీతాలాపన, రాష్ట్ర అధికారిక గాతాలాపన కార్యక్రమాలు నిర్వహిస్తారు. రణ, గౌరవ వందనం అనంతరం ఉదయం 9.32 నుంచి 9.45 గంటల వరకు పోలీస్ కవాతు నిర్వహించనున్నారు.ఉదయం 9.40 గంటలకు ముఖ్య అతిధి జిల్లా ప్రగతి సందేశాన్ని ఇస్తారని, 10.45 గంటల వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రగతి స్టాళ్లను ముఖ్య అతిధి సందర్శిస్తారని,అనంతరం 11:45 గంటలకు జాతీయ గేయాలాపన,జాతీయ గీతాలాపన అనంతరం 11:50 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగిస్తుందని అధికారులు తెలిపారు.



# బీజేపీ వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

## - ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 14(ప్రజా జ్యోతి)**

జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ను అవమానించేలా బీజేపీ వ్యవహరించిన తీరును ఖండిస్తూ శుక్రవారం నాగర్క ర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన,ధర్నాలో కార్యక్రమంలో శాసనసభ్యుడు డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి బీజేపీ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను,రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్ర తి ఒక్కరిపై ఉందని,కాంగ్రెస్ పార్టీ నాయకులపై అవమానకరమైన వ్యాఖ్యలను,చర్యలను సహించేది లేదని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, ఎస్సి సెల్ అధ్యక్షులు వంకేశ్వర్ నిరంజన్,పట్టణ ప్రెసిడెంట్ జక్కా రాజు,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





# ఖర్గే సభ ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేయడంపై కాంగ్రెస్ నిరసన

**మహబూబ్‌నగర్ ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానాన్ని అనంతరం గంగాజలంతో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. దళిత నాయకుడైన ఖర్గే సభ జరిగిన ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్యగా కనిపిస్తోందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు రాజ్యాంగం ప్రతిపాదించిన సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికవాద స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దేశంలో అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వ విలువలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కులం, మతం ఆధారంగా వివక్షకు తావులేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "సమానత్వమే లక్ష్యం.. రాజ్యాంగమే మార్గం.. కుల వివక్షకు తావులేదు" అంటూ నాయకులు నినాదాలు చేశారు. అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు నిరంతరం పోరాడుతామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మాసం రెడ్డి, సత్తూరి చంద్రకుమార్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





మొదటి పేజీ తర్వాత

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## - నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ :

## డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్ ఆగస్టు 14 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు రేషన్ పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డుల మంజూరును పట్టించుకోలేదని సంజీవ్ ముదిరాజ్ ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టిందన్నారు.

**గిగ్ కార్మికుల సంక్షేమానికి చర్యలు:**

రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా గిగ్ కార్మికుల సంక్షేమం కోసం వారికి చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల నిధులను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**ఖర్గేను అవమానించడం సరికాదు:**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అవమానించేలా బీజేపీ వ్యవహరించిందని సంజీవ్ ముదిరాజ్ ఆరోపించారు. మొదటి నుంచీ బీజేపీ దళితుల పట్ల వివక్షాపూరిత వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్, నాయకులు సాయిబాబా, నాగిరెడ్డి, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మా బతుకులను రోడ్డున పడేయొద్దంటూ ఆవేదన చిన్నంబావి

**- చిరు వ్యాపారులకు అండగా బీజేపీ.. అధికారులపై నిలదీత**

**- దుకాణాల ముందు రాళ్ల కుప్పలు.. వాల్మీకి చౌరస్తాలో వ్యాపారుల ధర్నా**

**- ఏళ్లుగా ఆధారంగా ఉన్న దుకాణాలు తొలగిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయంటూ ఆవేదన**

**- పరిస్థితి ఉద్రిక్తం.. వ్యాపారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు**

**- చిరు వ్యాపారుల జీవనోపాధికి రక్షణ కల్పించాలి: బీజేపీ నాయకులు**







**చిన్నంబావి, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల కేంద్రంలో చిరు వ్యాపారుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఏళ్లుగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారుల దుకాణాల ముందు కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో రాళ్లు, మొరం కుప్పలు పోయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వాల్మీకి చౌరస్తాలో కొద్దిసేపు ధర్నా నిర్వహించారు."ఏళ్లుగా ఇదే మా జీవనాధారం.. ఇప్పుడు దుకాణాల ముందు రాళ్ల కుప్పలు పోస్తే మా కుటుంబాల పరిస్థితి ఏమిటి?" అంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు 15 ఏళ్లుగా, మరికొందరు 18, 19 ఏళు గా ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటున్నామని తెలిపారు. తమ జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను అధికారులు అడ్డుకోవాలని కోరారు. ఉద్రిక్తంగా మారిన పరిస్థితి న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకుంటామని కొందరు వ్యాపారులు ఆవేదనతో పేర్కొనడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న చిన్నంబావి ఎస్ఐ రామన్‌గౌడ్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని వ్యాపారులకు నచ్చజెప్పారు.



అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకోకుండా పరిస్థితిని సద్దుమణిగేలా చర్యలు చేపట్టారు. చిరు వ్యాపారులకు బీజేపీ నేతల మద్దతు వ్యాపారుల ఆందోళనకు బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్న మల్లయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి, చిన్నంబావి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, జిల్లా ఓబీసీ మోర్చా నాయకుడు మేకల చెన్నయ్య యాదవ్ మద్దతు తెలిపారు. చిరు వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుకాణాల ముందు రాళ్లు, మొరం పోసిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాపారులకు న్యాయం జరగకపోతే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. "మా బతుకులను కాపాడాలి" వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు సయ్యద్ జాఫర్, కురుమయ్య, గోపినాయుడు తదితరులతో పాటు పలువురు మహిళా వ్యాపారులు తమ ఆవేదనను మీడియా ఎదుట వెల్లడించారు. "15 నుంచి 20 ఏళ్లుగా ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఒక్కసారిగా మా దుకాణాల ముందు రాళ్ల కుప్పలు పోస్తే మా బతుకులు ఎటు పోవాలి?" అని ప్రశ్నించారు. అధికారులు ఇరువర్గాల పత్రాలను పరిశీలించి వాస్తవాలను తేల్చి, చిరు వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా న్యాయం చేయాలని వారు కోరారు.